# కొత్త మెరుపు

నాగమణి నవ్వింది.

నది ఒడ్డున చెలిమ ఊటలా గుండె లోతుల్లోంచి తోసుకొచ్చే తరంగాల నాపుకోలేక ఉక్కిరిబిక్కిరై మొదటిసారి నవ్వింది.

నవ్వులో నవరత్నాలు కనిపించాయి నారాయణ తాతకు.

"ఏంది బిడ్డా ఉషారుగున్నవ్?"

తెల్లగడ్డం దువ్వుకున్నాడు చెట్లకు నీరుపారిస్తున్న తాత.

''నాకూ.... బీడిలు చుట్టుడొచ్చింది తాతా! ఆకు కత్తిరిస్తా, తంబాకు నింపుతా, దారంగడ్తా.... అన్నీ వచ్చినయ్!'' బోనస్ అందుకున్న బీడి కార్మికురాలిలా సంబరపడింది.

''దొరల యాత్రల పుణ్యమాని గిదన్నా నేర్చుకున్నవ్. వాల్లొచ్చేదాకా ఖుషీగుండు. వచ్చినంక మల్లా చెరల వడ్డబెకద బిడ్డా!'' చిరునవ్వును పెదాలమధ్య బిగపట్టి తన పనిలో లీనమయాడు.

గత పదిరోజులు నాగమణికి పది నిమిషాల్లా గడిచాయి. మరో ఐదు రోజులైతే మామూలు భాగోతమే. మళ్ళీ నరకయాతనే.

కోడికూతతో నిద్రలేచింది మొదలు రాత్రికి ఎక్కడివాళ్ళక్కడ గుర్రుపెట్టేదాకా యంత్రంలా పనిచెయ్యాలి. ఎవరిమాట కాదన్నా యమయాతనే.

"నా తలకాయ మీద గీరాత ఎందుకు రాసినవ్ దేవుడా? ఇది నీకు న్యాయమా?" పొంగిన గుండెకోత ఎన్నోసార్లు వినిపించింది దేవునికి నాగమ్మణి.

"బిడ్డా నాగూ! మయూరమ్మకు నిన్ను అరణంగా ఇస్తున్నారు. వాళ్ళత్తగారింటికాడనే ఉండాలె నువ్వు. మా తల్లి నన్నీ ఇంటికి గట్లనే తోలిచ్చింది - వాళ్ళదొరల మాట కాదనలేక కంట తడిబెట్టిన తల్లి నాదిలి పెట్టి ఆ బంగళా చిన్నకోడలు మయూరి వెంట అరణంగా వచ్చినప్పుడు కడుపులో పేగుల్ని తెడ్డుతో కలియబెట్టినట్లైంది.

అక్కడ తన ఆరో ఏట తల్లిచాటు పిల్ల దొరల పిల్లల ఈసడింపులకు రోషమొచ్చి-

" మా నాయన ఎవలమ్మా?" అనడిగింది తల్లిని.

కళ్ళ అంచులు దాటి చెంపల మీదికి జారబోతున్న నీటిధారల్ని బలవంతంగా ఆపుకుంటూ-

"అట్లా అడగద్దు నాగూ!" అంది తల్లి.

ఆ రోజు తల్లి అలాగెందుకందో ఈ బంగళాకొచ్చాక అనుభవం ద్వారా బోధపడింది.

మహారాజ భవనంలాగున్న బంగళాలో చిన్నమ్మ వెంట అడుగు పెట్టేప్పుడు తనుగూడా అదృష్టజాతకురాలనుకుందో క్షణం. కాని ఆ తర్వాత బంగళా గడపదాటనివ్వరనీ బయటి ప్రపంచాన్ని చూడనివ్వరనీ అనుకోలేదు.

పిల్లలూ పెద్దలూ అందరూ తనను నాగీ అనీ, పోరీ అనీ పిలిచినా బాధనిపించలేదు కాని....పప్పులో ఉప్పు తక్కువైందని పెద్దమ్మ జడ బట్టి లాగి లెంపలు వాయించినప్పుడు సృష్టి వెనుకకు నడిచినట్టనిపించింది. కందిపోయిన చెంపల్ని పుణుక్కుంటూ మూడ్రోజు లేడ్చింది. నాల్గోరోజు మయూరమ్మ మొగడు మొదటిసారి తన సర్వస్వాన్ని కొల్లగొట్టినప్పుడు ఆ భింతేమిటో సరిగా అర్థంగాలేదు. ఆ తర్వాత నడిపిదొర, పెద్దదొర్ల

చేతుల్లో పులిబోనులో మేకపిల్లలా గిజగిజలాడింది. పిడిగుద్దులు తొంగ దీశాయి.

తనలాగే తన కూతురు గూడా!

"మా నాయన ఎవరమ్మా?" అనడిగితే ఏం జెప్పాలి? దాని కూతురు దాన్నడిగితే ఏంచెబ్తుంది? ఇదెన్ని తరాలు? ఆలోచించినప్పుడు అయోమయంలో కొట్టుకుపోతుంది.

పెద్ద దొరసాని తమ్ముడొచ్చాడోసారి. అతని సేవలకు తనను ప్రత్యేకంగా కేటాయించారు. సకల సదుపాయాల్లో భాగంగా తనను గూడా సమర్పించుకోక తప్పలేదు. ఉదయం అతని స్నానానికి నీళ్ళు సరిగా వేడిచెయ్యలేదని పెద్ద దొర కొరడా తన వీపుమీద చిందులేసింది.

"బాంచెను దొరా .... కాల్మొక్త .... మళ్ళా కాగవెట్త దొరా...." అన్న అరుపులు అరణ్యరోదనలైనాయి. సకల సదుపాయాలందుకున్నవాడి పెదవులమీద చిరునవ్వు కదలాడింది.

నడిపి దొరసాని చెల్లె వచ్చినప్పుడు అలంకరణ సామానులు త్వరగా అందించలేదని తన గూబ గుయ్యిమయింది.

వంట పనులు, ఇంటి పనులు, ఒంటి పనులు అన్నీ చెయ్యాలి- పట్టెడు మెతుకుల కోసం. దెబ్బలు గూడా నోరెత్తకుండా భరించాలి - జానెడు పొట్ట కోసం.

కాళ్ళు కడుక్కునేందుకు నీళ్ళందివ్వలేదని చిన్న దొర, నారాయణ తాతను కర్రతో బాదుతుంటే నాగమణి రక్తం కుతకుతలాడింది. ఆడ పులిలా ఎగబడి చిన్న దొర గొంతు కసిక్కిన కొరికెయ్యాలనిపించింది.

"ఛీ పాపాత్ములు!" గొణుగుడు మయూరమ్మ చెవులబడింది. తనప్పుడు రెండు నెలల బాలింతరాలు. పిడి గుద్దులకు తోడు ఒక

రోజంతా బలవంతపు ఉపవాసం బహుమతి లభించింది. చంటిగుడ్డును రాత్రికి చంకల జేర్చుకుని, గుండెలకు హత్తుకుని "నా కడుపుల ఎందుకు పుట్టినవు బిడ్డా?" అని బావురుమంది.

"మా అమ్మమ్మ దాసిది. మా అమ్మ దాసిది. నేనూ అంతే. రేపు నువ్వు గూడా...." గుండెలవిసి కళ్ళు జలపాతాలైనాయి.

పదకొండు రోజుల క్రితం పెద్దదొరసాని పిలిచి "నాగీ! రేపు మేమంతా దక్షిణ యాత్రలకు బోతున్నాం. నువ్వూ, నారిగాడే ఉండాలె బంగ్లల. పదిహేను రోజులల్ల మల్లొస్తం. నువు బంగ్ల దాటి ఎటూ పోవద్దు తెలుసా?" అని చెప్పింది. గంగిరెద్దులా తలూపింది తను.

మర్నాడు వ్యాన్ మోటారొచ్చింది. వాళ్ళక్కావాల్సిన ఏర్పాట్లు చేసేసరికి తల ప్రాణం తోకకొచ్చింది. అంతా వెళ్ళిపోయారు. ఊపిరి పీల్చుకుంది మనసారా.

"గీ పదిహేను రోజులన్నా నువ్వూ, నీ బిడ్డా, నేనూ రందిలేకుండ, దెబ్బలు దినకుండ ఉంవొచ్చు బిడ్డా!" నారాయణ తాత ముడతల మొహం మడిచిన తాటాకు విసనకర్రలా విప్పుకుంది.

"నా లెక్క నువ్వుగూడా ఎప్పుడూ బంగ్లలనే ఎందుకుంటున్నవ్ తాతా?" ఎన్నాళ్ళనుంచో అడగాలనుకున్న ప్రశ్న అడిగింది.

"ఏంజెయ్యాలె బిడ్డా! మా నాయిన ఈ దొరల తండ్రి దగ్గర అప్పుదీసుకుని జీతమున్నడట. నేనుగూడా...."

"మరి అప్పు దీరిందా లేదా?"

"అప్పు దీరిందిగని మా చాకిరి తప్పలేదు!"

"గదెట్లా?"

"వీళ్ళ దగ్గర పంజేసుడు బంద్‌జేస్తే బొక్కలిరగగొట్టి పట్టు కొస్తరు. అంతా వాళ్ళిష్టమే. మనసుంటి పేదోళ్ళ గతి గింతే...." తాత నుదుటి అనుభవ రేఖలు ఆకుక్కపోయి విడిపోతున్నాయి. "నువ్వు రాక ముందు నేను పని బంద్‌జేస్తనని ఖచ్చితంగా చెప్పిన పెద్దొరకు. గప్పుడే ఇంతకు ముందున్న దాసీ ముండ పురుగుమందుదాగి సచ్చింది. అప్పుడది కడుపుతోనుండె పాపం! దానికి నేనే పురుగుమందు దాగిచ్చి సంపిన్ననీ, దానికి నేను కడుపుజేసిన్ననీ పోలీసులకు రిపోర్టిస్తమన్నరు. నా కాళ్ళు వొయ్యి కడుపుల జొచ్చినయ్."

"ఐతే ఏంజేసినవ్ తాతా?"

"ఇంకేం జేస్త? నేనిక్కణ్నె సచ్చేదాకా ఉంటానని కాళ్మొక్కిన దొరలందరికి. గప్పుడు ఇడిసిపెట్టింద్రు. వీళ్ళు లోకానికి దొరలు, మనకు దయ్యాలు బిడ్డా!" తాత కళ్ళల్లో మేఘాలు కరిగాయి.

"అమ్మా!.... ఆకలే...." నాలుగేళ్ళ కూతురు జమున నాగమణి కొంగులాగింది. జమునకు అన్నం తినిపిస్తుంటే ఎదురింటి సుగుణమ్మ కళ్ళల్లో మెదిలింది.

వారం రోజుల క్రితం నారాయణ తాతకు జెప్పి మొదటిసారిగా బంగళా దాటి సుగుణమ్మ ఇంటికెళ్ళింది. బీడీలు చుడుతున్న సుగుణమ్మా ఆమె కూతురు శకుంతలా సాదరంగా పిలిచి కూచోమన్నరు. చాయగూడా ఇచ్చారు.

"ఎప్పుడూ లేంది గిదేంది బిడ్డా? ఆశ్చర్యపోయింది సుగుణమ్మ.

"ఇంట్ల ఎవ్వలూ లేరుగదా? పాపం. పొద్దువోత లేదేమో?" శకుంతలే జవాబిచ్చింది, తన కళ్ళల్లోకి పరిశీలనగా చూస్తూ. సుగుణమ్మ కుటుంబ సభ్యులంతా రోజూ బంగళా కొస్తుంటారు ఏదో ఒక పనిమీద.

"గీ బీడీలెట్ల జేస్తరూ?" తన ఉత్సాహం నీరెండలా పొంగింది. శకుంతల అంతా వివరించి-

"నువ్వు గూడా నేర్చుకుంటవా?" అంది.

'నేర్చుకుంట." ఆసక్తి ఉబికొచ్చింది.

ఆకు కత్తిరించడం, పొగాకు నింపడం, దారం చుట్టడం.... రోజో పని నేర్పింది. ఎవ్వరి సలహా లేకుండా బీడీలు చుట్టడమొచ్చేసింది. మొన్న బీడీలు చుడుతూంటే రాంరెడ్డి పటేలు భార్య వాళ్ళింటికి రమ్మన్నది. వాళ్ళు దొరగారి పొలాన్ని కౌలుకు చేస్తున్నారు. వెళ్ళింతర్వాత ఆమాటా ఈమాటా మాట్లాడ్తూ పప్పు రుబ్బమని పురమాయించింది. రుబ్బినందుకు రెండ్రూపాయలిచ్చింది బలవంతంగా-

నిన్న కరణం లక్ష్మమ్మ ఇంటికెళ్ళి బస్తా బియ్యం శుద్ధిచేసింది. ఆవిడ ఐదు రూపాయలిచ్చింది. తక్కువ పెట్టుబడితో అందరికంటే ఎక్కువ దిగుబడి సాధించిన రైతులా తృప్తిపడింది. తనలోని ఉత్సాహం ఏదేదో ఆలోచించింది.

కడుపునిండగానే గంతులేస్తూ తోటలోకెళ్ళి జామచెట్టుకింద నిల్చుంది జమున. కూతురు గంతుల్ని గమనిస్తూ నాగమణి నిల్చుంది వచ్చి.

"తాతా పిట్ట పిల్లల్లేవూ.... అయ్యో...." అరిచింది జమున. తన సొమ్మెవరో దోచినట్టు.

"ఇంకెందుకుంటయ్? రెక్కలొచ్చినై, ఎగిరిపోయినై!" నవ్వేశాడు తాత.

"ఎట్లా?...." జమున కళ్ళల్లో నిరాశ.

''పక్షి పిల్లలు రెక్కలు రాంగనే ఎగిరిపోతా యెటో. మనుషుల లెక్క అవి ఒకలమీద ఆధారపడుండయి. వాటి బతుకు అవి బతుకుతై." జమున బుగ్గమీద ముద్దులు వద్దించిన తాత మొహమ్మీద ఆనందరేఖలు మెరిశాయి.

నాగమణి గుండెల్లో, వెన్నెముకలో, నరాల్లో కొత్త మెరుపేదో జర్రున పాకింది. తాతవైపు విచిత్రంగా దృక్కులు సారించింది.

o o o

పదహారో రోజు దక్షిణయాత్రల కెళ్ళిన వ్యాన్ తిరిగొచ్చింది- క్షేమంగా.

వ్యాను దిగుతూ -

"నాగీ....ఓ పోరీ....నాగీ!" పెద్ద దొరసాని పిలుపులు-కాదు అరుపులు.

బంగళాలో అడుగు పెడుతూ -

''ఎక్కడ చచ్చినవే నాగి ముండా! రా జల్దీ నీ....ఇవందుకో." పెద్దదొర రంకెలు.

నారాయణ తాత పరుగెత్తుకొచ్చి "నాగమణి, దాని బిడ్డా మూడ్రోజులనుంచి కనవడతలేదు దొరా!" అని సవినయంగా విన్నవించుకున్నాడు.

(ఈనాడు, ఆదివారం 8 మే, 1994)